సాక్షి
విజయనగరం

బుధవారం ၊ 10 ၊ మే ၊ 2023



వేసవి శిబిరాలతో క్రీడా వికాసం

శారీరక, మానసిక వికాసం కోసం క్రీడలు దోహదపడతాయని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. - 8లో



పెళ్లికి ఆహ్వానం

ఎస్.కోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం దంపతులు మంగళవారం కలిశారు. తమ రెండవ కుమార్తె పెళ్లికి హాజరు కావాలంటూ ఆహ్వానపత్రికను అందజేశారు.

స్కూటీ వితరణ



రేగిడి: మండలంలోని వన్నలిలో వావిలవలస గ్రామంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన సత్రానికి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి స్కూటీని వితరణగా ఇచ్చారని సామాజిక కార్యకర్త సిద్ధార్థ మంగళవారం తెలిపారు. అన్నసత్రానికి అవసరమైన సరుకులు తెచ్చేందుకు ఈ స్కూటీ ఉపయోగించాలని చైర్మన్ సూచించారన్నారు. టీటీడీ చైర్మన్‌కు సిద్ధార్థ కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రజలకు నాణ్యమైన వైద్యం



టెలీమెడిసిన్ హబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి. రమణకుమారి స్పష్టంచేశారు. స్థానిక ఘోషాస్పత్రిలోని టెలీమెడిసిన్ హబ్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. వివిధ పీహెచ్‌సీల నుంచి రోగులు చెప్పే సమస్యలను పూర్తిగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చికిత్స, సూచనలు తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టెలీ మెడిసిన్ సేవలు రోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

విజయనగరం పూల్‌బాగ్: ఎస్.కోట మండలం అలుగుబిల్లి గ్రామంలోని ఆదిత్య స్టోన్ క్రషర్‌ను జిల్లా విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు జరిపారు. అక్రమంగా మెటల్‌ను తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకుని రూ.70వేలు అపరాధ రుసుం విధించినట్టు విజిలెన్స్ ఏడీ మల్లేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ శ్రీనివాసరావు, టీఏ పైడితల్లి నాయుడు పాల్గొన్నారు.

ఇక 'విజయనగరం అర్బన్' మండలం

- గెజిట్ విడుదల



విజయనగరం అర్బన్, విజయనగరం రూరల్ పరిధిలు తెలిపే మ్యాప్

విజయనగరం అర్బన్: విజయనగరంలో ప్రత్యేక మండలం ఏర్పాటుకు సంబంధించిన గెజిట్‌ను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిల్లాలో కొత్తగా మరో మండలం ఆవిర్భవించింది. రాష్ట్రంలో కొత్తగా ఆరు మండలాలను ఏర్పాటు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ప్రైమరీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆరు జిల్లాల్లో జిల్లా కేంద్రం ఉన్న పట్టణాలను అర్బన్ మండలాలుగా విడదీస్తూ అందుకు సంబంధించిన ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా విజయనగరం పట్టణంలో కొంతభాగాన్ని విజయనగరం అర్బన్ మండలంగా ఏర్పడనుంది. ప్రస్తుతం విజయనగరం నియోజకవర్గం పరిధిలో 50 కార్పొరేషన్ డివిజన్లున్న విజయనగరం కార్పొరేషన్, 14 రెవెన్యూ పంచాయతీలతో విజయనగరం మండలం ఉంది. ఇందులో పట్టణం పరిధులతో విజయనగరం అర్బన్ మండలం ఏర్పాటు చేసే ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. అభ్యంతరాను, సలహాలు, సూచనల్ని ఇటీవల స్వీకరించి వాటి పరిష్కారాల చర్యలు ముగియడంతో గెజిట్ విడుదల అయింది.

అందుబాటులోకి మరో మూడు ఇసుక రీచ్‌లు



సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో త్వరలో మరో మూడు ఇసుక రీచ్‌ల అందుబాటులోకి రానున్నాయి. ఇసుకరీచ్‌ల నిర్వహణకు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆమోదం తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. సంతకవిటి మండలం తమరాం, రేగిడి ఆముదాలవలస మండలం కె.వెంకటాపురం, తెర్లాం మండలం కుసుమూరు ఓపెన్ ఇసుక రీచ్‌లపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన నివేదికను జిల్లా గనులు భూగర్భశాఖాధికారి సీహెచ్ సూర్యచంద్రరావు కలెక్టర్‌ని అందజేశారు. ఈ రీచ్‌ల పరిమాణాన్ని, ఇసుక లభ్యతను, ఇతర అంశాలను కలెక్టర్‌కు ఆయన వివరించారు. తమరాం ఇసుక రీచ్ సుమారు 3.24 హెక్టార్లలో దాదాపు 32,393 క్యూబిక్ మీటర్ల ఇసుక, కె.వెంకటాపురం రీచ్‌లో 4.85 హెక్టార్లలో 48,485 క్యూబిక్ మీటర్ల ఇసుక, కుసు మూరులో 1.13 హెక్టార్లలో 11,360 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఇసుక లభ్యత, నాణ్యత, ఇతర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ రీచ్‌ల నిర్వహణకు ప్రభుత్వం నుంచి జేసీ పవర్ వెంచర్స్ చట్ట ప్రకారం అనుమతులు పొందడానికి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కంపెనీ ఈసీ, సీఎఫ్ఈ, సీఎఫ్ఓ తదితర అనుమతులను ప్రభుత్వం నుంచి పొందిన అనంతరం ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. సమావేశంలో గ్రౌండ్ వాటర్ డీడీ దుర్గాప్రసాదరావు, ఎస్ఈబీ సూపరింటెండెంట్ సుధాకర్, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ శాఖాధికారులు పాల్గొన్నారు.

పైడితల్లి సేవలో భక్తజనం



పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన పైడితల్లి



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి చదురుగుడి వద్ద బారులు తీరారు. పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. మహిళలు పసుపు కుంకుమలను సమర్పించారు. ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. – విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి..
జగనన్నకు చెబుదాం

- 1902కు కాల్‌చేసి సమస్యను తెలియజేయండి
- ఫిర్యాదులు లేకుంటే జిల్లా యంత్రాంగం సమర్థతకు చిహ్నం
- మంత్రి బొత్స సత్యనారాయణ





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్సీ, జెడ్పీచైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరులు, (ఇన్‌సెట్లో) వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

విజయనగరం అర్బన్: ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక 'జగనన్నకు చెబుదాం' అని, ప్రజలందరూ తమ సమస్యలను 1902 నంబర్‌కు తెలియజేసి పరిష్కరించుకోవాలని మంత్రి బొత్స సతస్యనారాయణ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చక్కని వేదికను ఏర్పరచే లక్ష్యంతోనే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్ నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం మీడియాతో మంత్రి బొత్స మాట్లాడారు. ప్రజలు స్పందనలో ఇచ్చే వినతులు ఏ కారణంగా అయినా పరిష్కారం కానట్లయితే అటువంటి వినతులను సీఎం కార్యాలయ స్థాయిలో వాటికి పరిష్కారం చూపేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అందుబాటులోకి తెలిచ్చినట్టు వెల్లడించారు. గతంలో స్పందనలో వినతులు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాని సమస్యలను 1902కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. జిల్లా నుంచి ఎంత తక్కువగా ఫోన్‌కాల్స్ ఆ నంబర్‌కు వెళ్తే.. ఆ జిల్లాలో యంత్రాంగం అంత సమర్థంగా పనిచేస్తున్నట్టు పరిగణించాల్సి వస్తుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రితో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, జిల్లా ప్రత్యేక అధికారి, పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఎస్పీ దీపిక, జేసీ మయూర్ అశోక్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రేగాన శ్రీనివాసరావు, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్–2023కు సర్వం సిద్ధం

- నేడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహణ
- జిల్లాలో 30 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 9,342 మంది విద్యార్థులు



ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కన్వీనర్ ఆశారమణి, అధికారులు

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించే పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 17 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఆయా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు 9,342 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ ఏడాది పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఎక్కువ మంది దరఖాస్తు చేయడంతో పరీక్ష కేంద్రాలను పెంచారు.

పరీక్ష కేంద్రాలు ఇలా..

గతేడాది 7 వేల మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా మూడు ప్రాంతాల్లో 21 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఈ ఏడాది 9,342 మంది దరఖాస్తు చేయడంతో మరో తొమ్మిది కేంద్రాలను అదనంగా కేటాయించారు. విజయనగరం పట్టణ పరిధిలో 14, బొబ్బిలిలో 9, గజపతినగరంలో 7 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలో 14 కేంద్రాల్లో 4,912 మంది, బొబ్బిలిలో 2,532 మంది, గజపతినగరంలో 1898 మంది పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగియనున్నది. పరీక్షల నిర్వహణకు 410 మంది ఇన్విజిలేటర్లు, 31 మంది అబ్జర్వర్లను నియమించారు.

120 మార్కులకు ప్రవేశ పరీక్ష

ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం 120 మార్కులకు కాగా గణితం సబ్జెక్టులో 50 మార్కులకు 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలకు 40 మార్కులు, కెమిస్ట్రీలో 30 మార్కులతో 30 ప్రశ్నలకు పరీక్ష జరగనుంది. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు కోరారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

పక్కాగా ఏర్పాట్లు



పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశాం. పాలిసెట్ పరీక్షకు దరఖాస్తులు పెరగడంతో పరీక్ష కేంద్రాలను అదనంగా కేటాయించాం. మూడు ప్రాంతాల్లో 30 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నాం. అభ్యర్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలు కల్పించాం. – జి.ఆశారమణి, జిల్లా కన్వీనర్, ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

ఆర్మీ ఉద్యోగి దుర్మరణం

- బైక్‌ను టాటాఏస్ ఢీకొట్టడంతో ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి జగదీష్

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ రోడ్డులో సోంపురం జంక్షన్ బ్రిడ్జిపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గొల్జాం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి పిన్నింటి జగదీష్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్మీలో పనిచేస్తున్న జగదీష్ దగ్గర బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు సెలవుపై వచ్చాడు. ఈ నేపథ్యంలో సోమవారం గొల్జాం గ్రామానికి చేరుకున్నాడు. మంగళవారం అత్తవారిల్లు వేపాడ మండలం కరకవలస బైక్‌పైవెళ్లి తిరిగి రాత్రి గొల్జాం వస్తుండగా సోంపురం జంక్షన్ వద్ద బ్రిడ్జిపైకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో జగదీష్ తుళ్లిపడిపోగా బిడ్జి గోడకు తల కొట్టుకుని నుజ్జునుజ్జవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండు, మూడేళ్ల గల ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

520 కిలోల గంజాయి స్వాధీనం

- రూ.కోటి విలువ ఉంటుందని అంచనా



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: ఎస్.కోట పోలీసులు రూ.కోటి విలువచేసే 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీఐ సింహాద్రినాయుడు వెల్లడించారు. బొడ్డారా కూడలిలో పోలీసులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు జరిపారు. అనుమానంతో అరకు నుంచి విశాఖవస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఆపారు. గంజాయి స్మగ్లర్లు వాహనంతో పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు సమక్షంలో వాహనాన్ని సోదా చేయగా 520 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడిన వ్యక్తులు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కైరీపుట్ గ్రామానికి చెందిన కృష్ణహంతల్, ముంచంగిపుట్ జిల్లా కులాబెరు గ్రామానికి చెందిన కిముడు సోనాధర్‌గా గుర్తించారు. వీరిద్దరు రూ.15 లక్షలకు అరకులో గంజాయి కొనుగోలు చేశారని, ఎస్.కోట శివారు వరకు తీసుకొచ్చి వాహనంతో పాటూ సరుకును అప్పగించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అక్కడి నుంచి మరొక వ్యక్తి సరుకును తీసుకెళ్తారని పోలీసుల ప్రాథమిక విచారణలో చెప్పారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. మీడియా సమావేశంలో ఎస్.కోట ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్కూల్‌అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: ఎస్.కోట మండలం ధర్మవరం జెడ్పీహైస్కూల్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి బాలికల కళాశాల కొనసాగనుంది. స్కూల్ ప్లస్ కళాశాలలో పనిచేసేందుకు అర్హులైన, ఆసక్తికలిగిన జిల్లా పరిషత్ యాజమాన్యాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జియాలజీ సబ్జెక్టుల బోధనకు అర్హులైనవారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఈఓ కార్యాలయానికి సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా సీనియారిటీ, ప్రొఫిషియన్సీ టెస్ట్, అర్హతల ప్రకారం హైస్కూల్ ప్లస్‌లో డిపార్ట్‌మెంట్ బెస్ట్ టెస్ట్‌లో ఒక అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ నియామకాలు జరుగుతాయన్నారు. ప్రమోషన్, సీనియారిటీ లెక్కించినప్పు డు కేడర్‌లో ఎటువంటి మార్పు ఉండదన్నారు.

మణిపూర్ నుంచి క్షేమంగా ఇంటికి..



ఇంటికి చేరుకున్న విద్యార్థి జానేష్ శ్రీనివాస్‌తో తల్లిదండ్రులు ప్రసాద్, కృష్ణవేణి

భోగాపురం: మణిపూర్ రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లిన భోగాపురం గ్రామానికి చెందిన నరేడ్ల జానేష్ శ్రీనివాస్ మంగళవారం క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. మణిపూర్‌లో ఎస్సీ వర్గాల మధ్య నెలకున్న అల్లర్ల నేపథ్యంలో అక్కడ చదువుతున్న విద్యార్థులను స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మేము ఉంటున్న ప్రాంతంలోనే అల్లర్లు, దాడులు, బాంబు పేలుళ్లు జరగడంతో భయభ్రాంతులకు గురయ్యామన్నారు. భోజనం, తాగునీరు, నిద్ర లేకుండా, ఏక్షణాన ఏమి జరుగుతందోనని అనుక్షణం భయపడుతూ రెండు రోజుల పాటు కళాశాల మైదానంలో గడిపామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటుచేసిన ప్రత్యేక విమానాలపై రాష్ట్రానికి చేరుకున్నామన్నారు. విద్యార్థులకు భోజనంతో పాటు విమానాశ్రయం నుంచి నేరుగా ఇంటకి చేరుకునేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు విద్యార్థి తల్లిదండ్రులు ప్రసాద్, కృష్ణవేణి కృతజ్ఞతలు తెలియజేశారు.

సృజనకు పదును

- 'సాక్షి' ఆధ్వర్యంలో సందడిగా చిత్రలేఖనం పోటీలు
- చిన్నారులను అభినందించిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి
- విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ల ప్రదానం
- పోటీల నిర్వాహకులకు అభినందనలు





ఇష్టంగా.. ఆసక్తిగా.. : చిత్రలేఖనంలో నిమగ్నమైన చిన్నారులు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు వేసిన కొన్ని చిత్రాలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మాజీ ఎంపీ బొత్సఝాన్సీ



చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో బొత్స ఝాన్సీ, నిర్వాహకులు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరంలోని తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో సత్య విద్యా సంస్థలు, లిఫ్టింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు సందడిగా సాగాయి. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సృజనకు పదును పెట్టారు. అబ్బురపరిచే చిత్రలేఖనాలతో చూపరులను మురిపించారు. పోటీలను మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించడంతో విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందుతుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'సాక్షి' చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు.

రెండు విభాగాల్లో పోటీలు..

చిత్రలేఖనం పోటీలను రెండు విభాగాలలో నిర్వహించారు. ఐదు నుంచి తొమ్మిది సంవత్సరాల వయసు గల వారు జూనియర్ విభాగంగా, 10 నుంచి 15 సంవత్సరాల వయసు గల వారు సీనియర్ విభాగంగా విభజించి పోటీలు నిర్వహించారు. పోటీలకు మొత్తం 95 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారితో పాటు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. చిన్నారులు వేసిన చిత్రలేఖనాలను మాజీ ఎంపీ డాక్టర్.బొత్సఝాన్సీలక్ష్మి పరిశీలించి ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ రేజేటి కరుణాకర్ జడ్జిగా వ్యవహరించారు. కార్యక్రమంలో బాలల హక్కులు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు, సత్య డిగ్రీ, పీజీ కళాశాలల సంచాలకులు డాక్టర్.ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.వి.సాయి దేవమణి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్. ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్, బి. సూరపునాయుడు, శ్రీనివాస్, లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంఘం వ్యవస్థాపకుడు కె.గౌరీశంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా: 15 మందికి గాయాలు



గాయపడిన వ్యక్తికి భద్రగిరి సీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెద్దగూడ గ్రామ సమీపంలో వ్యాన్ బోల్తాపడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈమేరకు ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షన్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లటి గ్రామానికి చెందిన 15 మంది నిగరాం గ్రామంలో మంగళవారం శుభకార్యానికి హాజరయ్యేందుకు వ్యాన్‌లో బయల్దేరారు. మార్గమధ్యంలోని పెద్దగూడ సమీపంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరిక బాబూరావు, సీమల నీలమ్మ, సిరిమంతి, అరుణ్, ఆరిక అర్జున్, సీమల చంద్రయ్య, ఆరిక మనోజ్, కృష్ణారావు, సీమన్నలతో పాటు డ్రైవర్ సీమల వసంత్‌లకు కొద్దిపాటి గాయాలయ్యాయి. క్షతగాత్రులను తక్షణమే భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్ వద్ద ఎస్‌ఈబీ అధికారులు

సంతకవిటి: మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం శంభరుని అగ్రహారం వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.శ్రీధర్, ఎస్సై పిచ్చేశ్వరరావులు పట్టుకుని సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బోడియమ్మ

పార్వతీపురం: భర్త చనిపోతానని బెదిరిస్తుండడంతో మనస్తాపం చెందిన భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం బల్లపాడు గ్రామానికి చెందిన పి.బోడియమ్మ భర్త సింగ్ నిత్యం మద్యం తాగి వచ్చి చనిపోతానని భార్యాపిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. భర్త చనిపోతే పిల్లలు అనాథలైపోతారని భావించిన భార్య మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేసింది. విషయాన్ని గమనించిన భర్త ఆటోలో చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించాడు.

చెట్టుపై గీత కార్మికుడి మృతి



కొబ్బరిచెట్టుపై విగతజీవిగా వేలాడుతున్న రాములప్పన్న

విజయనగరం క్రైమ్: కొబ్బరి కొమ్మలు కొట్టేందుకు చెట్టు ఎక్కిన వ్యక్తి ఆ చెట్టుకే వేలాడుతూ విగతజీవిగా మారాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న కణపాకకు చెందిన అంగటి రాములప్పన్న (63) గీత కార్మికుడు. పద్మావతినగర్‌లో కొబ్బరి కొమ్మలు కొట్టేందుకు చెట్టు ఎక్కాడు. కొమ్మ కొట్టే క్రమంలో ఒక కొమ్మ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడింది. దాన్ని చెట్టుపై నుంచి లాగేందుకు ప్రయత్నించే క్రమంలో షాక్ తగలడంతో మృతిచెంది చెట్టుకు వేలాడాడు. వెంటనే స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. హుటాహుటిన టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 485.00
విజయనగరం	రూ. 489.00
శ్రీకాకుళం	రూ. 489.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,850-00
బంగారం(22సి. 10గ్రా.)	56,700-00
వెండి (కిలో)	82,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

వేసవి శిబిరాలతో క్రీడా వికాసం



క్రీడా శిబిరాల నిర్వహణకు అవసరమైన కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్, ఎంపీ తదితరులు

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విజయనగరం: మానసిక శారీరక వికాసం కోసం క్రీడలు దోహదపడతాయని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడాపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని, నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం చదువుపైనే కాకుండా ఆటలపైనా దృష్టి సారించాలని చెప్పారు. క్రీడల ద్వారా విద్య, ఉద్యోగాలు కూడా సాధించవచ్చన్నారు.

యువతకు శిక్షణ ఇచ్చేందుకు జెడ్పీ నిధులు

జిల్లాపరిషత్ చైర్మన మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడారంగానికి ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా క్రీడా శిబిరాలను నిర్వహించడమే కాకుండా, స్పోర్ట్స్ కిట్లను కూడా అందిస్తున్నామని, ఇందుకోసం ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు



బాక్సింగ్ శిబిరం ప్రారంభోత్సవంలో తలపడుతున్న బాలికలు

క్రీడారంగంలో జిల్లాకు ఘనచరిత్ర

ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రీడారంగంలో జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడి క్రీడాకారులు దేశవిదేశాల్లో ఎంతో పేరుప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ మాట్లాడుతూ, వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని వివరించారు. కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, తైక్వాండో, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములు జిల్లా ప్రధాన శిక్షకులు రాజగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్మథమార్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కేవీ సూర్యనారాయణ రాజు, తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఫెన్సింగ్ కోచ్ ఎం.సతీష్‌కుమార్, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, పలువురు కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం



సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా జట్టును అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- సీఎం కప్ ఫుట్‌బాల్ విజేతలను అభినందించిన కోలగట్ల

విజయనగరం: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 33 సంవత్సరాల తర్వాత ఫుట్‌బాల్ క్రీడాంశంలో విజయనగరం జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేయడం గర్వించదగిన విషయమన్నారు. తిరుపతి జిల్లాలో ఇటీవల జరిగిన సీఎం కప్- 2023 ఫుట్‌బాల్ ఫైనల్స్‌లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు.. అసోసియేషన్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన చేతుల మీదుగా కప్పును అందుకున్నారు. అనంతరం వారిని కోలగట్ల అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, విజయనగరం ఖ్యాతిని నలుదిశలా చాటాలని సూచించారు. క్రీడాకారులకు ఏ అవసరం వచ్చినా తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోలగట్ల ప్రోత్సాహం, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారం వల్లే తాము రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి విజేతలుగా నిలవగలిగామని ఈ సందర్భంగా క్రీడాకారులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున కోలగట్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శపుడి రజినీకుమార్, ఉపాధ్యక్షుడు డి.చిట్టి, కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.బి.ఎస్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

11న సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్‌జూనియర్స్ బాల, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 11న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీఎస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2007 జనవరి 10వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా స్పష్టం చేశారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 14 నుంచి రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని, అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

- రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఇంటింటికి తాగునీటి కుళాయి అందించడంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన జల జీవన్ మిషన్ పథకం పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నాలుగు మండలాల ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా తొలి విడతలో ఎన్ని గ్రామాల్లో పనులు జరిగాయి? ఇంకా ఎన్ని గ్రామాల్లో జరగాల్సి ఉంది? రెండో విడతలో ఎన్ని గ్రామాలు పూర్తి చేయాల్సి ఉందనే అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి అందించే బృహత్తర కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. అన్ని గ్రామాల్లోనూ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిలు ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలకు స్థలం సిద్ధం చేయాలి

అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆర్‌డీఓ, డీఎస్పీ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని ఆర్‌డీఓ ఎం.అప్పారావుకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. రెండు కార్యాలయాలకు స్థలం సిద్ధం చేస్తే తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా సీహెచ్‌సీలో మోడరన్ పోస్టుమార్టం గది నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, చీపురుపల్లి ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, చీపురుపల్లి, గుర్ల, గరివిడి జెడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, ఆర్‌డీఓ ఎం.అప్పారావు, నాలుగు మండలాల ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, జి.భాస్కరరావు, రామకృష్ణ, కల్యాణి, తహసీల్దార్ ఎం.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ.సూర్యనారాయణరాజు, ఎస్‌వీ.రమణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'ఘట్టం

- ఐదు దశాబ్దాల అనంతరం ఆత్మీయ కలయిక
- మధురస్మృతులను నెమరువేసుకున్న 1972-73 విద్యార్థులు
- ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



పూర్వ ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): వారంతా ఐదు దశాబ్దాల క్రితం గరివిడి మండలంలోని తోండ్రంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. పాఠశాల చదువుల అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన వారు కొంత మందైతే, సొంత గ్రామాల్లో వ్యవసాయం, వ్యాపారాల్లో స్థిరపడిన వారు మరికొంత మంది. జీవితాల్లో స్థిరపడి వివాహాల అనంతరం వారి పిల్లలకు పెళ్లిళ్లు చేసి మనుమలను ఎత్తుకునే ఆరు దశాబ్దాల పైబడిన వయసులో వారంతా ఒకచోట కలవాలనుకున్నారు. ఈ కలయికకు తాము చదువుకున్న పాఠశాలనే వేదికగా ఏర్పాటు చేసుకుని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవాలనుకున్నారు. ఈ మేరకు వారు చదువుకున్న ఉన్నత పాఠశాలలోనే మంగళ వారం జరిగిన ఆత్మీయ కలయికలో భాగస్వాములయ్యారు. అప్పుడెప్పుడో చదువుకున్న వారంతా ఒక్కసారిగా కలవడంతో ఒకరినొకరు హత్తుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు చదువుకున్నప్పుడు చేసిన అల్లర్లు, ఆటలు పాటలు తదితర తీపి గుర్తులను మరోసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ ఆత్మీయ కలయికలో భాగంగా తమకు చదువు చెప్పిన ప్రధానోపాధ్యాయుడు ఆరవెల్లి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించి ఆయన దీవెనెలు అందుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గంగప్పడు

గజపతినగరం: బొండపల్లి మండలం తమటాడ గ్రామానికి చెందిన గొలగాన గంగప్పడు(35) అదృశ్యమైనట్లు భార్య సంతోషి మంగళవారం రాత్రి గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై మూర్తి కేసు నమోదు చేశారు. ఈ మేరకు అయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భార్యను తీసుకువెళ్లేందుకు మూడురోజుల క్రితం గజపతినగరం మండలం రంగుపురం గ్రామంలోని అత్తవారింటికి గంగప్పడు వచ్చాడు. తాను రెండు రోజుల్లో వస్తానని భార్య చెప్పడంతో వెళ్లిపోయిన గంగప్పడు నేటికీ ఇంటికి చేరకపోవడంతో భార్య ఫిర్యాదు చేసింది.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులంతా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. - పార్వతీపురం

సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన బి.పాపమ్మ చినభోగిలి బస్టాండ్ నుంచి ఇంటికి రైల్వే గేటు మీదుగా వెళ్తున్న తరుణంలో వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో కుడికాలిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారును బైక్ ఢీకొని దంపతులకు..

పార్వతీపురం మండలం నర్సిపురం పంచాయతీ విశ్వంబరపురం గ్రామానికి చెందిన కె.గౌరి పార్వతీపురం నుంచి నర్సిపురం మీదుగా ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో నర్సిపురం గ్రామం సమీపంలో కారు సడన్‌గా తిప్పడంతో కారును ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న గౌరి, భార్య గౌరమ్మలకు పలు చోట్ల గాయాలయ్యాయి. దంపతులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి..

కురుపాం మండలం పొలంగూడ గ్రామానికి చెందిన బి.భాస్కరరావు తన స్నేహితుడు బి.మురళితో కలిసి మొండెంఖల్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బారామని జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో భాస్కరరావుకు పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను బొలెరో ఢీకొని ముగ్గురికి..

పార్వతీపురం పట్టణంలోని రెల్లివీధికి చెందిన ఎస్.కిరణ్, స్నేహితులు పవన్‌కుమార్, జయేంద్రలు కొత్తవలస నుంచి పట్టణంలోనికి ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో ఫ్లెటైవర్ వద్ద ముందుగా వెళ్తున్న బొలెరో అకస్మాత్తుగా టర్న్ అయి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి పలు చోట్ల గాయాలయ్యాయి.

హోరాహోరీగా కుస్తీ ఎంపిక పోటీలు



జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండ గుంపాం గ్రామంలో అండర్-15 జిల్లా స్థాయి కుస్తీ ఎంపిక పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో అనూష, పావని, రిషిత, భవాని, లిఖిత, బాలుర విభాగంలో చరణ్, శరత్, గౌరి శంకర్, కిరణ్, సురేష్, రామచరణ్ ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు జిల్లాలో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

10 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్ట్



గంజాయి నిందితులను హాజరుపరిచిన సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: అరకులో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీ తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ ఎస్.బాలసూర్యారావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్త్ ఢిల్లీకి చెందిన బాబిదేవి, అనురాగ్‌కుమార్, ఎ.కుష్వాలు అరకులో 10 కేజీ గంజాయిని కొనుగోలు చేసి ఆర్‌టీసీ బస్సులో విశాఖపట్నం తరలిస్తున్నారు. ఈ క్రమంలో తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆర్‌టీసీ బస్సులోంచి ముగ్గురు వ్యక్తులు పరారయ్యేందుకు యత్నించారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకుని క్షుణంగా తనిఖీ చేయగా గంజాయి విషయం బయటపడింది. దీంతో పరారయ్యేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు నిందితులను హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై బి.దేవి, కానిస్టేబుల్స్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి గంజాయి

- విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా
- వినియోగం నుంచి విక్రయం వరకు గట్టి నిఘా
- తరచూ దాడులతో పెరుగుతున్న కేసులు
- నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ వెల్లడి
- గంజాయి నియంత్రణపై విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీల సమీక్ష



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీఐజీ హరికృష్ణ, విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీలు

దొండపర్తి: 'ఒడిశా నుంచి.. రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయాలు ఉన్న విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సప్లయ్ చైన్‌పై పోలీసుల డేగ కన్ను ఉంది. ఇందుకోసం పక్క రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంతో అనేక మంది విక్రయదారులను అరెస్టు చేశాం. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడంతో పాటు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తాం'అని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో విశాఖ రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో డీఐజీ హరికృష్ణతో కలిసి ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణపై సీపీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో గంజాయి సాగుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్, ఇతర ప్రాంతాలో గంజాయి సాగు చేసి.. అక్కడి నుంచి అనేక మార్గాల్లో విశాఖకు తీసుకువచ్చి.. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై గట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. కేవలం వినియోగదారులను పట్టుకోవడమే కాకుండా వారికి ఎవరు విక్రయించారు? ఎలా వచ్చింది? ఇలా మొత్తం సప్లయ్ చైన్ లింక్‌పై దృష్టి పెడుతున్నామని వివరించారు. ఇటీవల పెందుర్తిలో పట్టుకున్న 450 కిలోల గంజాయి కేసులో అసలు సూత్రధారి కోరాపుట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు. విశాఖ మీదుగా ఢిల్లీకి తీసుకువెళ్లే ప్రయత్నంలో వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

గట్టి నిఘాతోనే పెరుగుతున్న కేసులు

గట్టి నిఘా పెట్టి విస్తృతంగా తనిఖీలు చేస్తున్న కారణంగానే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని సీపీ తెలిపారు. ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గంజాయి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కారణంగానే 2021లో 221 కేసుల్లో 2,700 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. 2022లో 255 కేసుల్లో 6,200 కేజీలు, ఈ ఏడాది నాలుగు నెలల్లో 88 కేసుల్లో 382 మందిని అరెస్టు చేసి 1800 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి హోటళ్లలో బస చేసే వారిపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. హోటళ్లలో బస చేసే వారు ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని.. నగరంలోని 510 హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. 165 ట్రాన్స్‌పోర్టు సంఘాలకు నోటీసులివ్వగా.. ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన సమాచారంతోనే 40 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు తెలియజేస్తూ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పార్వతీపురం మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ కోరాపుట్, రాయగడ్ నుంచి గంజాయి రవాణా అవుతోందన్నారు. ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో కేవలం 8 మంది వినియోగదారులను గుర్తించామన్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణ కోసం ఇచ్ఛాపురం, ఆముదాలవలస ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.